సూర్య 18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

సూర్య www.suryaa.com

4PM www.suryaa.com

ఆదివారం 04-05-2025 పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు




# నేడు కోల్‌కతా vs రాజస్థాన్

ఐపీఎల్ 2025లో నేడు (మే 4న) కోల్‌కతా నైట్ రైడర్స్ vs రాజస్థాన్ రాయల్స్ మధ్య కీలక మ్యాచ్ (KKR vs RR Prediction) జరగనుంది. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ మైదానంలో మధ్యాహ్నం జరగనున్న ఈ మ్యాచ్ ఆసక్తికరంగా కొనసాగనుంది. అయితే రాజస్థాన్ జట్టు ఇప్పటికే ప్లేఆఫ్ రేసు నుంచి తప్పకున్నప్పటికీ, రేసులో సజీవంగా ఉన్న KKRను కట్టడే చేయాలని చూస్తోంది. పాయింట్ల పట్టిక విషయానికొస్తే కోల్‌కతా జట్టు 10 మ్యాచ్‌లలో 4 గెలిచి 7వ స్థానంలో ఉంది. ప్లేఆఫ్ రేసులో కొనసాగాలంటే, మిగిలిన 4 మ్యాచ్‌ల్లోనూ కేకేఆర్ గెలవాలి. కాబట్టి ప్రతి మ్యాచ్ కూడా గెలవడం తప్పనిసరిగా మారింది. అయితే ఈ మ్యాచులో ఏ జట్టు ఎక్కువగా గెలిచే ఛాన్సుందనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

KKR vs RR హెడ్ టు హెడ్ రికార్డులు

ఇరు జట్లు ఆడిన మొత్తం మ్యాచ్‌లు 30. వీటిలో కోల్‌కతా గెలిచింది 15 కాగా, రాజస్థాన్ గెలిచింది 14. ఒకటి అసంపూర్తిగా మారింది. మరోవైపు ఈడెన్ గార్డెన్స్‌లో KKK-RR మధ్య జరిగిన మ్యాచ్‌లు 10 కాగా, KKR 6 గెలువగా, రాజస్థాన్ 4 గెలిచింది.

గెలుపు అంచనా..

కోల్‌కతా తన చివరి మ్యాచ్‌లో గెలిచి ఇక్కడికి చేరుకోగా, రాజస్థాన్ ఓటమిని చవిచూసింది. కోల్‌కతా ఢిల్లీ క్యాపిటల్స్‌ను 14 పరుగుల తేడాతో ఓడించగా, రాజస్థాన్ ముంబైపై 100 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ క్రమంలో ఇరు జట్లు కూడా గెలవాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గూగుల్ గెలుపు అంచనా ప్రకారం చూస్తే మాత్రం ఈ మ్యాచులో కోల్‌కతా నైట్ రైడర్స్ గెలిచేందుకు 59 శాతం అవకాశం ఉండగా, రాజస్థాన్ రాయల్స్ జట్టుకు 41 శాతం ఛాన్సుంది. అయితే ఇక్కడ చెప్పిన ప్రకారం తప్పకుండా ఇలాగే జరుగుతుందని చెప్పలేం. అప్పుడప్పుడు ఈ



అంచనా కూడా మారనుంది.

KKR, RR ప్లేయింగ్ 11 అంచనా

కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సునీల్ నరైన్, అజింక్యా రహానే (కెప్టెన్), అంగ్క్రిష్ రఘువంశీ, వెంకటేష్ అయ్యర్, రింకూ సింగ్, ఆండ్రీ రస్సెల్, రోవ్‌మన్ పావెల్, అనుకుల్ రాయ్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, ఇంపాక్ట్ ప్లేయర్ వైభవ్ అరోరా కలరు.

రాజస్థాన్ రాయల్స్ జట్టులో వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, నితీష్ రాణా, రియాన్ పరాగ్ (c), ధృవ్ జురెల్ (wk), శుభమ్ దూబే, షిమ్రోన్ హెట్మైయర్, జోఫ్రా ఆర్చర్, మహేష్ తీక్షణ, కుమార్ కార్తికేయ, ఆకాష్ మధ్వల్, ఇంపాక్ట్ ప్లేయర్ ఫజల్హాక్ ఫరూకీ ఉన్నారు.

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| ఆర్సీబీ | 11 | 8 | 3 | 16 |
| ముంబై | 11 | 7 | 4 | 14 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 13 |
| గుజరాత్ | 9 | 6 | 3 | 12 |
| ఢిల్లీ | 10 | 6 | 4 | 12 |
| లక్నో | 10 | 5 | 5 | 10 |
| కొల్‌కత్తా | 9 | 4 | 5 | 9 |
| రాజస్తాన్ | 11 | 3 | 8 | 6 |
| సన్‌రైజర్స్ | 9 | 3 | 6 | 6 |
| చెన్నై | 11 | 2 | 9 | 4 |




## పోలీసులు, ప్రభుత్వ పెద్దలపై ఆరోపణలు..
# ప్రముఖ యూట్యూబర్ అన్వేష్‌పై కేసు



బెట్టింగ్ యాప్‌లు ఎంతోమంది జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. దీని బారిన పడి పలువురు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. ఎంతోమంది తమ విలువైన జీవితాలను కోల్పోతున్నారు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ యాప్‌లను కొంతమంది సినీ ప్రముఖులు ప్రమోట్ చేశారు. వీరిపై కూడా రేవంత్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేసిన వారు ఎంతవారైనా విడిచి పెట్టేది లేదని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ యాప్‌లను హైదరాబాద్ మెట్రోరైలులో ప్రమోట్ చేస్తున్నారని తెలంగాణ హైకోర్టు దృష్టికి పలువురు తీసుకెళ్లారు. అయితే మెట్రోలో బెట్టింగ్ యాప్స్ ప్రచారం వెనుక కొంతమంది ప్రభుత్వ పెద్దలు ఉన్నారంటూ ప్రముఖ యూట్యూబర్, ప్రపంచ యాత్రికుడు అన్వేష్ ఆరోపణలు చేశారు. నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ అన్వేష్‌పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సుమోటాగా కేసు నమోదు చేశారు. ఇటీవల కాలంలో అక్రమ బెట్టింగ్ యాప్‌లు ప్రమోషన్లు చేస్తున్న వారిపై వరుసగా అన్వేష్ వీడియోలు చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రో రైలులో బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై అన్వేష్ వీడియో చేశారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తెలంగాణ డీజీపీ జితేందర్, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, మాజీ సీఎస్ శాంతి కుమారి, ఐఏఎస్‌లు దాన కిషోర్, వికాస్ రాజ్‌లపై అన్వేష్ ఆరోపణలు చేశారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల ద్వారా రూ.300 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని అన్వేష్ వీడియోలో పేర్కొన్నారు. అవాస్తవంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ అన్వేష్‌పై ఓ కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు అన్వేష్‌పై సుమోటోగా పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారుల విశ్వాసనీయతను దెబ్బతీసేలా, ప్రభుత్వం మీద వ్యతిరేకతను కలిగించేలా ఈ వీడియో ఉందని కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.

## రాజధాని నిర్మాణ పనులు వేగవంతం..
# సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున:ప్రారంభానికి కూటమి ప్రభుత్వం రెండు రోజుల క్రితం శ్రీకారం చుట్టింది. అమరావతి పర్యాటనలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అమరావతి నిర్మాణంలో అండగా ఉంటామని మోదీ హామీ ఇచ్చారు. దాంతో.. మోదీ టూర్ తర్వాత రాజధాని అమరావతి నిర్మాణ పనులను ఏపీ ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. ప్రధాని మోదీ చేతుల మీదుగా పునః ప్రారంభోత్సవం పూర్తి కావడంతో రాజధాని పనులు పరుగులు తీయనున్నాయి. ఈ క్రమంలోనే.. ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హై కోర్టు భవనాల తుది డిజైన్లపై ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తాజాగా.. సీఆర్డీయే కార్యాలయంలో నార్మన్ పోస్టర్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ సమావేశం అయ్యారు. ఐకానిక్ భవనాల డిజైన్లు ఖరారు చేసేందుకు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పలు భవనాల డిజైన్లును మంత్రి నారాయణ, అధికారులకు ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు వివరించారు. ఇక.. 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం అమరావతిని రాజధానిగా నిర్ణయించింది. అక్కడ పలు భవనాల నిర్మాణ పనుల్ని మొదలు పెట్టింది. కొన్ని నిర్మాణాల పునాదుల కోసం భారీ గుంతలు తవ్వి పనులు మొదలు పెట్టారు.. ప్రధానంగా.. అమరావతిలో సచివాలయం ఐకానిక్ భవనాల కోసం అప్పుడే ర్యాఫ్ట్ ఫౌండేషన్ వేశారు. అయితే.. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడం.. మూడు రాజధానులు తెరపైకి రావడంతో అమరావతి పనులకు బ్రేకులు పడ్డాయి. ఈ క్రమంలో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజధాని అమరావతి పనులు వేగవంతం చేస్తోంది. ఐకానిక్ భవనాల డిజైన్లను ఖరారు చేసి త్వరలోనే పూర్తిస్థాయి పనులు చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. టవర్ల నిర్మాణాన్ని కూడా రెండున్నర నుంచి మూడేళ్లలోపే పూర్తి చేసేందుకు సీఆర్‌డీఏ ప్లాన్ చేస్తోంది.

హర్షం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు..

ఏపీ రాజధాని అమరావతి పనుల పున:ప్రారంభ కార్యక్రమం విజయవంతమవ్వడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రగతికి మద్ధతుగా నిలుస్తామన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలు మరింత నమ్మకాన్ని నింపాయని నేతలతో చెప్పారు చంద్రబాబు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే సభ సక్సెస్ అయిందన్నారు. సభ నిర్వహణకు సమస్త ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పని చేసిందన్న ముఖ్యమంత్రి.. సమన్వయంతో పని చేశారంటూ మంత్రులు, ఎమ్మెల్యేలకు అభినందనలు తెలిపారు. అమరావతి ఆవశ్యకతను వివరించేందుకే ప్రధాని మోదీ చేతుల మీదుగా పనులు పున:ప్రారంభించామన్నారు. అమరావతి ఒక నగరం కాదు- - - ఒక శక్తిగా మారుతుందన్న ప్రధాని మాటలు స్ఫూర్తిని నింపాయన్నారు. రాష్ట్ర వృద్ధి రేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందని ప్రధాని చేసిన వ్యాఖ్యలు భవిష్యత్ రాజధానిని ఆవిష్కరించాయన్నారు సీఎం చంద్రబాబు. ప్రధాని మోదీ ప్రసంగం ప్రజల పట్ల ఉన్న అభిమానానికి, రాష్ట్రాభివృద్ధిపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచిందన్నారు చంద్రబాబు. మరోవైపు అమరావతి పునఃప్రారంభం కార్యక్రమంపై చంద్రబాబు ట్వీట్ చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు చెప్పారు. ప్రజల సహకారం, కేంద్రం మద్దతు, పక్కా ప్రణాళికతో.. ఫ్యూచర్ సిటీగా అమరావతిని నిర్మిస్తామన్నారు చంద్రబాబు.



## అందంలో అప్సరస కానీ అవకాశాలు మాత్రం నిల్

కృష్ణగాడి వీర ప్రేమ గాద సినిమా తర్వాత తెలుగులో వరుసగా జవాన్, పంతం, కవచం, సినిమాలు చేసింది ఈ సినిమాలన్నీ డిజాస్టర్స్ గా నిలిచాయి. అదే సమయంలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఎఫ్2 సినిమాతో సాలిడ్ సక్సెస్ అందుకుంది. ఈ సినిమాలో హానిగా కనిపించి మెప్పించింది.మెహరీన్ కౌర్.. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన కృష్ణగాడి వీర ప్రేమ గాద సినిమాతో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది ఈ చిన్నది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. తొలి సినిమాలోనే బబ్లీ లుక్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ వయ్యారి భామ.ఆ తర్వాత ఫిల్లౌరి అనే హిందీ సినిమాతో బాలీవుడ్లోకి కూడా అడుగుపెట్టింది. ఇక తిరిగి తెలుగులో తెలుగులో మహానుభావుడు, రాజా ది గ్రేట్ లాంటి సూపర్ హిట్ సినిమాలనుఈ అందుకుంది. ఆతర్వాత తమిళ్ లోనూ అదృష్టం పరీక్షించుకుంది ఈ చిన్నది .కానీ అక్కడ సక్సెస్ కాలేకపోయింది.

## విశాఖపట్నం జిల్లా భీమిలిలో జరిగిన
# వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు

విశాఖపట్నం జిల్లా భీమిలిలో జరిగిన వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్యకు పాల్పడిన క్రాంతి కుమార్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి మీడియాకు వెల్లడించారు. దాకమర్రి పంచాయతీ పరిధిలోని 26వ జాతీయ రహదారి పక్కన గల ఫార్చ్యూన్ హిల్స్ ఉడా లేఅవుట్‌లో శుక్రవారం ఉదయం సగం కాలిన స్థితిలో మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. హంతకులు ఆమెను గొంతు కోసి, ఆపై పెట్రోల్ పోసి దహనం చేసినట్లు గుర్తించారు. మృతురాలి మెడలో కాలిన నల్లపూసల గొలుసు ఉండటంతో ఆమె వివాహిత అని నిర్ధారించారు. కేసును ఛేదించేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వెంకటలక్ష్మితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న క్రాంతికుమార్ ఆమెను



హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. క్రాంతికుమార్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారు. అతను తన రెండో భార్యతో కలిసి మృతురాలి ఇంటి పక్కనే నివసిస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటలక్ష్మితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో క్రాంతి కుమార్ రెండో భార్యకు, వెంకటలక్ష్మికి మధ్య గొడవలు జరగడంతో అతను తన రెండో భార్యను వేరే బ్లాక్‌కు మార్చాడు.అయినప్పటికీ, క్రాంతి కుమార్ వెంకటలక్ష్మితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయంపై మొదటి భార్య, రెండో భార్యతో తరచూ గొడవలు జరుగుతుండటంతో పాటు, వెంకటలక్ష్మి తనతోనే ఎక్కువ సమయం గడపాలని ఒత్తిడి చేయడంతో ఆమెను అడ్డు తొలగించుకోవాలని క్రాంతి కుమార్ పథకం వేశాడు.



# చికెన్ కిలో రూ.800
## ఆకలి రాజ్యంలో అల్లాడిపోతున్న పాక్

భారత్‌తో కాదు..ముందు నిత్యావసరాల రేట్లతో ఫైట్ చేయాలి పాకిస్తాన్. ఏం కొనేటట్టు లేదు. ఏం తినేటట్టు లేదు అంటూ పాక్ పౌరులు వాపోతున్నారు. ఆకలిరాజ్యంలో అల్లాడిపోతున్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితిలో ఉన్న పాక్.. భారత్‌కు సవాళ్లు విసురుతూ నవ్వులపాలవుతోంది.. డజను గుడ్లు రూ. 332, చికెన్ కిలో రూ. 798.89, కిలో బియ్యం రూ. 339.56, లీటర్ పాలు రూ. 224, టమాటా కిలో రూ. 150, ఆలూ కిలో రూ. 105, అర కిలో బ్రెడ్ రూ. 161.28 .. ఈ రేట్లు ఎక్కడో కాదు.. పక్క దేశం.. పాకిస్తాన్‌లోని నిత్యావసరాల ధరలు.. పాకిస్తానీ రూపాయల ప్రకారం ఉన్న ఈ ధరలు ఆ దేశానికి దడ పుట్టిస్తున్నాయి. ఆకలి రాజ్యానికి కేరాఫ్ అడ్రస్‌లా మారింది మన పొరుగు దేశం. ఇక భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో- - -2 నెలలకు సరిపడేలా సరుకులు నిల్వ చేసి ఉంచుకోమని తమ పౌరులకు, మరీ ముఖ్యంగా పీవోకే వాసులకు చెబుతోంది పాకిస్తాన్. కానీ పాకిస్తాన్‌లో ఆ పరిస్థితి ఉందా ? ఈ రేట్లు చూస్తే రెండు నెలల సరుకులు కాదు కదా.. రెండు రోజుల సరుకులు కూడా కొనుక్కుని పెట్టుకోగలిగేలా కనిపించడం లేదు. పాక్‌ను భయపెడుతున్న భారత్ ఆర్మీ.. రేట్ల పోటుతో మరో తలనొప్పి అటు భారత్ ఆర్మీతో పాటు ఇటు ధరల పెరుగుదల కూడా పాకిస్తాన్‌ను భయపెడుతోంది.



## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిని వెంటనే నియమించాలని రాజాసింగ్ విజ్ఞప్తి

తెలంగాణ బీజేపీలో నాయకత్వ మార్పు అంశం మరోమారి చర్చనీయాంశమైంది. పార్టీ సీనియర్ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన తాజా వ్యాఖ్యలు దీనికి కారణమయ్యాయి. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి నియామకాన్ని వేగవంతం చేయాలని ఆయన బీజేపీ అధిష్ఠానానికి కీలక విజ్ఞప్తి చేశారు.ఇవాళ మీడియాతో మాట్లాడిన రాజాసింగ్, పార్టీలో ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల తీరుపై తన అసంతృప్తిని బహిరంగంగా వెలిబుచ్చారు. ఈ సమావేశాలను ఆయన 'టైం పాస్ మీటింగ్స్'గా అభివర్ణించారు. ఇలాంటి సమావేశాలతో తాను అలసిపోయానని, ఆదివారం కూడా మరో 'టైం పాస్' సమావేశం ఏర్పాటు చేశారని విమర్శించారు. రాష్ట్ర పార్టీకి పూర్తిస్థాయి అధ్యక్షుడిని వీలైనంత త్వరగా నియమించాలని ఆయన పార్టీ అధిష్ఠానాన్ని కోరారు.అయితే, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి నియామక ప్రక్రియకు మరికొంత సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ పూర్తయిన తర్వాతే రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముందుగా జాతీయ అధ్యక్షుడి ఎన్నికను పూర్తి చేసి, ఆ తర్వాత పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలపై దృష్టి సారించాలని అధినాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం.





## క్రైస్తవంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు.. ఏపీ హైకోర్టు కీలక తీర్పు

షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వ్యక్తులు క్రైస్తవ మతంలోకి మారిన రోజునే వారి ఎస్సీ హోదా రద్దవుతుందని, అలాంటి వారికి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద లభించే హకులు ఉండబోవని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద రక్షణ కావాలని పోలీసులకు ఫిర్యాదు చేసే హకు కూడా ఉండదని, ఒకవేళ ఆ విధంగా కేసు పెట్టినప్పటికీ అది చెల్లుబాటు కాబోదని తేల్చి చెప్పింది. ఇలాంటి ఫిర్యాదులపై పోలీసులు చార్జిషీట్లు దాఖలు చేయాల్సిన అవసరం కూడా లేదని స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పించేందుకే ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తుచేసింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా కొనసాగుతున్న చింతాడ ఆనంద్ అనే వ్యక్తి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కొందరిపై ఫిర్యాదు చేయడాన్ని ఆక్షేపించింది. ఆ పాస్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేసింది. పదేండ్ల క్రితమే క్రైస్తవ మతంలోకి మారిన ఆనంద్ ఎస్సీ కాదని పేర్కొన్నది. ఈ మేరకు జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఇటీవల తీర్పు వెలువరించారు.

## పాక్ యువతిని రహస్యంగా పెళ్లాడిన సీఆర్పీఎఫ్ జవాన్

### జవాన్ ఉద్యోగం ఊడింది



పాకిస్థాన్ మహిళను రహస్యంగా వివాహం చేసుకున్న సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మునీర్ అహ్మద్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అనుమతి తీసుకోకపోవడమే కాకుండా ఈ విషయం దాచిపెట్టినందుకు అతడ్ని ఉద్యోగం నుంచి తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా, దీనిపై మునీర్ అహ్మద్ స్పందించారు. తనపై చర్యలు తీసుకోవడం అన్యాయమని, కోర్టులో సవాల్ చేస్తానని స్పష్టం చేశాడు. అంతేకాదు, తన పెళ్లికి కేంద్రం నుంచి కూడా అధికారిక అనుమతి తీసుకున్నట్టు తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడితో భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకున్న తరుణంలో ఈ ఘటన వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది.జమ్మూలోని ఘరోటా ప్రాంతానికి చెందిన మునీర్ అహ్మద్.. 2017లో సీఆర్పీఎఫ్‌లో చేరారు. అయితే, 2024 మే 24న పాకిస్థాన్‌కు చెందిన యువతి మినాల్ ఖాన్‌తో వీడియో కాల్ ద్వారా ఆన్‌లైన్ నిఖా చేసుకున్నాడు. ఈ వివాహానికి సీఆర్‌పీఎఫ్ ప్రధాన కార్యాలయం నుంచి 2024 ఏప్రిల్ 30న అనుమతి వచ్చిందని మునీర్ వెల్లడించారు. అయితే, పహల్గామ్ ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందని అనుమానిస్తోన్న భారత్?. ఆ దేశంపై దౌత్యపరమైన ఆంక్షలు విధించింది. పాకిస్థాన్ పౌరులను వెనక్కి పంపాలని భారత్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మునీర్ అహ్మద్.. పాక్ యువతి వివాహ విషయం వెలుగులోకి వచ్చింది.ఫిబ్రవరి 28న మినాల్ వాఘా-అట్టారి సరిహద్దు గుండా భారత్‌లో ప్రవేశించారు. ఆమెకు ఇచ్చిన 15 రోజుల షార్ట్ టర్మ్ వీసా మార్చి 22న ముగిసింది. అయితే, దీర్ఘకాలిక వీసా కోసం మినాల్ ఖాన్ కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. ఇంతలోనే పహల్గామ్ దాడి చోటుచేసుకోవడం డిపోర్టేషన్ ముప్పు ఎదురైంది. సీఆర్పీఎఫ్ ప్రకారం.. మునీర్ తన వివాహాన్ని గోప్యంగా ఉంచడమే కాకుండా.. వీసా గడువు ముగిసిన తర్వాత ఆమెకు ఆశ్రయం కల్పించడం జాతీయ భద్రతకు హానికరమని పేర్కొంటూ ఆయనను సేవల నుంచి తొలగించింది.

## పహల్గామ్ దాడి అమెరికాకు తెలిసే జరిగింది.. కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు



కశ్మీర్ అందాలను వీక్షించేందుకు వెళ్లిన పర్యాటకులపై పహల్గామ్‌లో ఉగ్రాదులు దాడి చేశారు. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వెనక పాకిస్తాన్ హస్తం ఉందని.. ఆ దేశంతో భారత్ దౌత్య సంబంధాలను తెంచుకుంది. సింధూ జాలల ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంతో పాటు మన దేశంలో ఉన్న పాకిస్తానీయులు తిరిగి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో తాజాగా పహల్గామ్ లో ఉగ్రదాడి గురించి ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు.పహల్గామ్ దాడి గురించి అమెరికాకు ముందే తెలుసని కేఏ పాల్ చెప్పుకొచ్చారు. అమెరికా నిఘా వర్గాల వద్ద పూర్తి సమాచారం ఉందని పేర్కొన్నారు. దాడి చేసినవారు, చేసినవారి ఉద్దేశాలు, దాడి వెనక ఉన్న శక్తుల వివరాలన్నీ అమెరికా నివేదికల్లో ఉన్నాయని అభిప్రాయపడ్డారు. గ్లోబల్ పీస్ మిషన్ ద్వారా తాను ప్రపంచ కేఏ పాల్ కోసం కృషి చేశారు. అందులో భాగంగా ప్రధానమంత్రి, వైట్‌హౌస్ అనుమతితో పాకిస్తాన వెళ్లి ఇరు దేశాల మధ్య సంది కుదుర్చుతానని గతంలో పాల్ మాట్లాడారు. ఇప్పుడు ఆ వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి.




## పోస్టాఫీస్ గొప్ప స్కీమ్.. ఒక్కసారి పెట్టుబడితో ప్రతినెలా రూ. 9 వేలు

ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సంపాదించిన ప్రతి రూపాయిని భద్రంగా ఉంచుకుంటూ, దానిపై కొంతైనా రాబడి పొందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కొందరు అధిక లాభాల కోసం రిస్క్ తీసుకునే పెట్టుబడుల వైపు మొగ్గుచూపితే, మరికొందరు మాత్రం ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా స్థిరమైన ఆదాయాన్ని ఆశిస్తారు. అలాంటి వారికి పోస్టాఫీసు అందిస్తున్న మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ ఒక చక్కటి పరిష్కారం. మీ పెట్టుబడికి పూర్తి భద్రతతో పాటు, ప్రతి నెలా మీ చేతికి కొంత మొత్తం అందుతూ ఉంటే మీ ఆర్థిక ప్రణాళిక ఎంత సులభంగా ఉంటుందో ఊహించండి. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన సీనియర్ సిటిజన్లకు వారి నెలవారీ ఖర్చుల కోసం ఈ పథకం ఒక ఆశాకిరణంలాంటిది.
ఖర్చులను అదుపులో ఉంచుకుంటూ, భవిష్యత్తు కోసం పొదుపు చేయడం తెలివైన ఆర్థిక నిర్వహణకు మొదటి మెట్టు. పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ అలాంటి వారికి ఒక అద్భుతమైన అవకాశం. ఇందులో ఒకేసారి కొంత పెద్ద మొత్తాన్ని పెట్టుబడి పెట్టి, రాబోయే ఐదు సంవత్సరాల పాటు ప్రతి నెలా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చు. మెచ్యూరిటీ తర్వాత మీ పెట్టుబడి మొత్తం కూడా వస్తుంది. ఈ పథకంలో మీ డబ్బు మార్కెట్ ఒడుదొడుకులకు గురికాదు, అంటే మీ పెట్టుబడి పూర్తిగా సురక్షితం. స్థిరమైన ఆదాయాన్ని అందించే పథకంగా ఇది ప్రజల్లో విశేషమైన ఆదరణ పొందింది.

**ఎలాంటి వారు అర్హులు? ఎంత పెట్టుబడి పెట్టొచ్చు?**

పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్‌లో ఖాతాను ఎవరైనా వ్యక్తిగతంగా లేదా గరిష్ఠంగా ముగ్గురు వ్యక్తులు కలిసి జాయింటుగా తెరవవచ్చు. అంతేకాదు, 10 సంవత్సరాలు నిండిన పిల్లల పేరు మీద వారి సంరక్షకులు (గార్డియెన్స్) కూడా ఖాతా తెరవడానికి అవకాశం ఉంది. ఈ పథకంలో కనీసం రూ. 1,000 పెట్టుబడి పెట్టవచ్చు. ఒకే వ్యక్తి పేరు మీద గరిష్ఠంగా రూ. 9 లక్షలు, అదే జాయింట్ ఖాతా అయితే గరిష్ఠంగా రూ. 15 లక్షల వరకు పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది.

**వడ్డీ రేటు, రాబడి..**

ప్రస్తుతం ఈ పథకంపై 7.4 శాతం వార్షిక వడ్డీని పోస్టాఫీసు అందిస్తోంది. మీరు డిపాజిట్ చేసిన మొత్తంపై మెచ్యూరిటీ పూర్తయ్యే వరకు ప్రతి నెలా ఈ వడ్డీ మీ ఖాతాలో జమ అవుతుంది. అయితే, ఈ పథకం ద్వారా వచ్చే వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.


**మెచ్యూరిటీ, ముందస్తు ఉపసంహరణ..**

పోస్టాఫీసు ఎంఐఎస్ ఖాతా తెరిచిన తేదీ నుంచి 5 సంవత్సరాలకు మెచ్యూరిటీ పూర్తవుతుంది. ఒకవేళ మీరు మెచ్యూరిటీకి ముందే డబ్బును ఉపసంహరించుకోవాలనుకుంటే, అప్పుడు పోస్టాఫీసు నిబంధనల ప్రకారం కొంత శాతం వడ్డీని మినహాయించి మిగిలిన మొత్తాన్ని మీకు తిరిగి ఇస్తుంది. కాబట్టి, దీర్ఘకాలిక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకంలో చేరడం మంచిది.

**ఎంత ఇన్వెస్ట్ చేస్తే ఎంతొస్తుంది?**

ఉదాహరణకు, మీరు ఒంటరిగా ఖాతా తెరిచి రూ. 9 లక్షలు ఎంఐఎస్ స్కీమ్‌లో డిపాజిట్ చేస్తే, ప్రస్తుత వడ్డీ రేటు ప్రకారం మీకు ప్రతి నెలా సుమారుగా రూ. 5,550 ఆదాయం వస్తుంది. అదే మీరు జాయింట్ ఖాతా తెరిచి గరిష్ఠంగా రూ. 15 లక్షలు డిపాజిట్ చేస్తే, మీ నెలవారీ ఆదాయం దాదాపు రూ. 9,250 వరకు ఉంటుంది. మీ నెలవారీ ఖర్చులు, మీరు ఆశించే ఆదాయం ఆధారంగా మీరు ఎంత పెట్టుబడి పెట్టాలో నిర్ణయించుకోవచ్చు. ఉదాహరణకు రూ. 5 లక్షలు జమ చేస్తే.. నెలనెలా చేతికి రూ. 3083 చొప్పన వస్తుంది. పోనీ 3 లక్షలు మాత్రమే ఇన్వెస్ట్ చేస్తే అప్పుడు ప్రతి నెలా రూ. 1850 వడ్డీ వస్తుంది. కాబట్టి, మీ కష్టార్జితానికి భద్రతతో పాటు ప్రతి నెలా స్థిరమైన ఆదాయాన్ని పొందాలనుకుంటే, పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ ఒక మంచి ఎంపికగా నిలుస్తుంది. ఆలస్యం చేయకుండా ఈ పథకం పూర్తి వివరాలు తెలుసుకొని, మీ భవిష్యత్తును ఆర్థికంగా సురక్షితం చేసుకోండి.

## తెలుగు రాష్ట్రాల్లో రెయిన్ అలర్ట్.. తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు



నెలకొన్నాయి.. పగలు ఎండలు దారెత్తిస్తుండగా.. సాయంత్రం వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం మరో అప్డేట్ ఇచ్చింది.. ఆదివారం, సోమవారం తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని అలర్ట్ జారీ చేసింది.ఈ రోజు తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.
తెలంగాణలోని 14 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ..
ఈ రోజు తెలంగాణలోని మంచిర్యాల, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.
తెలంగాణలోని తొమ్మిది జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ..
తెలంగాణలో ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నాయి..
ఆదివారం తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ రోజు ఈ 6 జిల్లాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ రోజు గరిష్టంగా నిజామాబాద్ లో 43.4, కనిష్టంగా భద్రాచలం లో 38.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. నిన్న నిజామాబాద్, ఆదిలాబాద్, నల్లగొండ, మెదక్, రామగుండం, లలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్.. 42.4, ఆదిలాబాద్.. 42.3, నల్లగొండ.. 41, మెదక్.. 40.6, రామగుండం.. 39.6, మహబూబ్ నగర్.. 39.5, ఖమ్మం.. 39.4, భద్రాచలం.. 38, హైదరాబాద్.. 38, హనుమకొండ.. 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## విరాట్ కోహ్లీ సరికొత్త రికార్డు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సరికొత్త రికార్డు క్రియేట్ చేశాడు. ఐపీఎల్‌లో 300 సిక్స్‌ల మైలురాయి అందుకున్న కోహ్లీ.. ఒకే జట్టు తరఫున ఈ ఘనత సాధించిన ఏకైక ప్లేయర్ గా చరిత్రలోకి ఎక్కాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఈ ఘనత సాధించాడు. చెన్నై బౌలర్ ఖలీల్ అహ్మద్ వేసిన మూడో ఓవర్‌లో చివరి 2 బంతులను కోహ్లి భారీ సిక్సర్లుగా మలిచి ఈ ఫీట్ సాధించాడు. ఒకే జట్టు తరఫున అత్యధిక సిక్స్‌లు బాదిన జాబితాలో కోహ్లి 301★ సిక్స్‌లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. కోహ్లి తర్వాత క్రిస్ గేల్ ఆర్‌సీబీ తరఫున 263 సిక్స్‌లు కొట్టగా.. ముంబై ఇండియన్స్ తరఫున రోహిత్ శర్మ 262, కీరన్ పోలార్డ్ 258 సిక్స్‌లు బాదారు. చెన్నై తరఫున ధోనీ 257 సిక్స్‌లు కొట్టాడు. ఐపీఎల్‌లో గత 18 సీజన్లుగా విరాట్ కోహ్లీ ఆర్‌సీబీకే ఆడుతున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ(33 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 62)హాఫ్ సెంచరీ నమోదు చేసి పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక సార్లు 500 ప్లస్ సీజన్ రన్స్ చేసిన బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు విరాట్ కోహ్లీ 505 రన్స్ చేశాడు. ఈ మ్యాచ్‌తో ఆరెంజ్ క్యాప్‌ను తిరిగి కైవసం చేసుకున్నాడు. ఐపీఎల్‌లో కోహ్లీ 500 ప్లస్ రన్స్ చేయడం ఇది 8వ సారి. ఈ క్రమంలో అతను డేవిడ్ వార్నర్ రికార్డ్‌ను అధిగమించాడు.

